ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

సోమవారం 6 అక్టోబరు 2025 | 3





వైభవంగా శ్రీదేవి అమ్మవారి నిమజ్జన ఉత్సవ ఊరేగింపు



డప్పు కళాకారుల ప్రదర్శన

- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు
- వందలమంది కళాకారులతో నృత్యప్రదర్శన

అమలాపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణంలోని దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి నిమజ్జన ఊరేగింపు ఆదివారం వైభవంగా జరిగింది. భారీగా ఉత్సవ కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. సినీ మ్యూజికల్ బ్యాండ్, సంప్రదాయ గిరిజన కొమ్ము కోయడ్యాన్సులు, కాళికానృత్యప్రదర్శన, భూత, భేతాల సెట్‌లు, కోతి డ్యాన్సు, బుట్ట బొమ్మలు, కర్రబొమ్మలు, గరగనృత్యాలు, జానపద డప్పుల నృత్యాలు, అమ్మవారి వేషధారణలు అలరించాయి. వందలాది సాంస్కృతిక కళాకారుల ప్రదర్శనతో భారీఊరేగింపు శ్రీదేవి మార్కెట్‌నుంచి ప్రారంభమైంది. అక్కడ వీధుల్లో తిరిగిన అనంతరం హైస్కూల్ సెంటర్, గడియారస్తంభం సెంటర్, మెయిన్‌రోడ్డు మీదుగా నల్లవంతెన వరకు సాగింది. పెద్దసంఖ్యలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుతో వేలాదిమంది ప్రజలు అమ్మవారి నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాలను తిలకించారు. పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటుచేశారు. ఊరేగింపు కారణంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తింది.



అమలాపురంలోని శ్రీదేవి అమ్మవారి నిమజ్జన ఉత్సవ ఊరేగింపులో ఆకట్టుకున్న ఉగ్ర నృసింహ అవతారం, శక్తివేషం



116 ఎకరాలు కేటాయించిన రాజమహేంద్రవరంలోని బ్రిడ్జిలంక

భూ..లోకం!

ఉమ్మడి జిల్లాలో పర్యాటక ప్రాజెక్టులకు 205 ఎకరాలు

పర్యాటక రంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది.. పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తే అడిగింది ఇచ్చేందుకు సిద్ధమవుతోంది.. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 205 ఎకరాలు భూములు సిద్ధం చేసింది.. ఇందులో రాజమహేంద్రవరానికి చేరువగా బ్రిడ్జిలంక వద్ద 116 ఎకరాలు సేకరించారు.. కడియం, సీతానగరం , కాకినాడ తదితర ప్రాంతాల్లోనూ భూములు ఉండడం గమనార్హం. ఆసక్తి ఉండి ముందుకొస్తే చాలు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

- పర్యాటకానికి పెద్దపీట
- భూమిని సిద్ధం చేసిన ప్రభుత్వం
- దీర్ఘకాలిక లీజుపై ఇచ్చే యోచన
- పెట్టుబడిదారులకు ఆహ్వానం
- ముందుకొస్తే భూకేటాయింపు
- ఉమ్మడి జిల్లాలో అమలు
- నాడు ఏమీ పట్టని వైసీపీ
- నేడు పట్టు వదలని కూటమి

ప్రకృతి అందాలకు నెలవైన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పర్యాటక రంగాన్ని పరుగులు తీయించేందుకు ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే గోదావరి అందాలు,సముద్ర తీరం వెంబడి అనేస సాహస జలక్రీడల నిర్వహణకు సన్నాహాలు చేస్తోన్న ప్రభుత్వం తాజాగా పర్యాటక పెట్టుబడులను భారీగా ఆహ్వానించేందుకు కసరత్తు ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలో చిన్న, మధ్యతరహా, భారీ పర్యాటక పెట్టుబడులతో ముందుకొచ్చే కంపెనీలకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా తక్షణమే భూములు కేటాయించేలా భూ బ్యాంకు సిద్ధం చేసింది.తక్కువ ధరకే భూములు దీర్ఘకాలిక లీజులపై కేటాయించాలని నిర్ణయించింది.ఈ మేరకు ప్రభుత్వమే ఉమ్మడి జిల్లాలో 205 ఎకరాల భూములు సిద్ధం చేసింది.కాకినాడ, ఏలేశ్వరం, గోగుల్లంక, పిచ్చుకలంక,సీతానగరం, కడియపులంక తదితర అద్భుత పర్యాటక అందాలు ఉన్న ప్రాంతాల్లో భూములు కేటాయించేందుకు ఏర్పాట్లు చేసింది.రాజమండ్రిలోని బ్రిడ్జిలంక వద్ద 116 ఎకరాలు సిద్ధం చేసింది.

కూటమి ప్రత్యేక దృష్టి

గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి జిల్లాలో పర్యాటక రంగం పూర్తిగా పడకేసింది. గోదావరిలో బోటు షికారు, కాకినాడ హోప్‌ఐలాండ్ షికారు, దిండి రిసార్ట్స్ వద్ద బోటింగ్ ఇలా దేనికీ వసతులు కల్పించక బోట్లు కేటాయించక పర్యాటక రంగం ఈసురోమంది. కాకినాడ సాగర తీరంలో యుద్ధవిమాన మ్యూజియానికి సైతం నిధులివ్వకుండా ఖాళీగా వదిలేసింది. ప్రభుత్వం మారిన తర్వాత గడచిన ఏడాదిగా ఉమ్మడి జిల్లాలో పర్యాటక సదుపా యా లకు సర్కారు పెద్దపీట వేస్తోంది.నిధులు కేటాయిస్తోంది. గత ప్రభుత్వంలో ఏ మాత్రం పట్టించుకోని గోదావరి హేవలాక్ వంతెనతో పాటు చుట్టుపక్కల అనేక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కేంద్రం నుంచి రూ.94.44 కోట్ల నిధులు రాబట్టి అఖండ గోదావరి ప్రాజెక్టుకు జూన్‌లో శంకుస్థాపన చేసింది. గోదావరి ఇసుక తిన్నెల్లో 120 ఎకరాల్లో టెంట్‌సిటీ నిర్మాణానికి అడుగులు వేస్తోంది.ఐదేళ్లుగా నిలిచిన కాకినాడ హోప్ ఐలాండ్ పర్యాటకాన్ని ఇటీవల పునరుద్ధరించింది.కాకినాడ, రాజమహేంద్రవరం,కోనసీమ జిల్లాల్లో 18 చోట్ల అడ్వంచర్ టూరిజం ప్రోత్సహించడానికి ఆదేశాలిచ్చింది.కాలువలు, సముద్రతీరం వెంబడి సాహస జలక్రీడలు అందుబాటు లోకి తెచ్చేలా టెండర్లు పిలిచింది.ఉమ్మడి జిల్లాలో పర్యాటక పెట్టుబడులు కోట్లలో రాబట్టేందుకు వీలుగా భూబ్యాంకు సిద్ధం చేసింది.

భూములున్నదిక్కడే..

పర్యాటక ప్రాజెక్టులకు భూములు తక్షణం కేటాయించేందుకు వీలుగా కాకినాడ నగరానికి సమీపంలోని తమ్మవరంలో 12.66 ఎకరాలు భూ బ్యాంకు తయారు చేసింది. సర్వేనెంబరు 292 నుంచి 299 వరకు సముద్రానికి దగ్గర ఉన్న భూములు రకరకాల పర్యాటక ప్రాజెక్టులు ఇచ్చేందుకు సిద్ధం చేసింది. వీటిలో హోటళ్లు, రిసార్టులు, బైక్, కారు రేసింగ్‌లు, సాహస క్రీడల ప్రాజెక్టులకు కేటాయించనుంది.ఏలేశ్వరం వద్ద సర్వే నెంబరు 83/2లో 15 ఎకరాలు సిద్ధం చేసింది. ఇక్కడ రిసార్టులు,నేచర్ టూరిజం ప్రోత్సాహానికి కేటాయింపులు చేయనున్నారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో సర్వే నెం బరు 799లో 9.9 ఎకరాల భూబ్యాంకు సిద్ధ మైంది. ఇక్కడా గోదావరి అందాలు వీక్షించేలా బోటింగ్ రెస్టారెంట్,అడ్వంచర్ గేమ్స్ ఏర్పాటుకు భూ కేటాయింపులు జరపనున్నారు. సీతానగరం మండలం పురుషోత్తపట్నం గోదావరి అందా లకు పెట్టింది పేరు. ఇక్కడ ఎన్నో సినిమాలు చిత్రీకరణ జరిగాయి. అద్భుతమైన లోకేషన్లు ఉన్న ఈ ప్రాంతంలో సర్వేనెంబరు 327/1లో 7.5 ఎకరాల భూ బ్యాంకును అందుబాటులోకి తెచ్చారు. రిసార్టులు, హోటళ్లు, బోటింగ్, హట్‌లు, వాటర్ స్పోర్ట్స్ ఇలా ఏతరహా పర్యాటక పెట్టుబడులు పెట్టాలన్నా వీటిని కేటాయించనున్నారు. రాజమహేంద్రవరం నగరంలోని బ్రిడ్జిలంక వద్ద ఏకంగా 116 ఎకరాల అన్ సర్వేయడ్ భూమిని సిద్ధం చేశారు. టెంట్ హౌస్‌లు, బోటింగ్, రిసార్టుల నిర్మాణానికి వీటిని కేటాయించాలని నిర్ణయించారు. కడియపులంకలో సర్వే నెంబరు 402/1లో 2.60 ఎకరాలు, కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పిచ్చుకలంక దీవిలో సర్వే నెంబరు 155/1లో 26 ఎకరాల భూ బ్యాంకు సిద్ధమైంది. కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం గోగుల్లంక వద్ద సర్వే నెంబరు 759లో 13.62 ఎకరాలు సిద్ధంగా ఉన్నాయి. ఇక్కడ గోదావరి అందాల వీక్షణ,కేరళ తరహాలో కొబ్బరి చెట్ల అందాలు, మండువా లోగిళ్లు పర్యాటకులను అలరించనున్నాయి. ఇక్కడ రిసార్టులు, హోటళ్ల నిర్మాణానికి భూములు కేటాయించనున్నారు.పట్టిసీమలో 168 ఎకరాలు పర్యాటక సంస్థలు, వ్యక్తులకు కేటాయించనున్నారు.వీటిని తక్కువ ధరకు దీర్ఘకాలిక లీజుపై కేటాయించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.



అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా కడియం వద్ద ఇలా..



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, చిత్రంలో ఎమ్మెల్యేలు ఆనందరావు, నాయకర్.. మాట్లాడుతున్న మల్లాడి

మత్స్యకార వర్గాల సంక్షేమం కోసం

సీఎం చంద్రబాబు కృషి

- రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర
- రూ.2కోట్లతో నిర్మించే మత్స్యకార సంఘ భవనానికి శంకుస్థాపన
- సభలో పాల్గొన్న ఎమ్మెల్యేలు ఆనందరావు, నాయకర్

అమలాపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మత్స్యకార సామాజికవర్గాల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమని రాష్ట్ర గనులు, భూగర్భశాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మత్స్యకారుల కోసం మత్స్యకార భరోసాను సైతం పెంచి అందరికీ అందించిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కిందన్నారు. జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణంలోని వడ్డిగూడెం సమీపంలో రూ.2కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన మత్స్యకార సంఘ భవన నిర్మాణానికి మంత్రి కొల్లు రవీంద్ర, స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన బహిరంగ సభ ఎమ్మెల్యే ఆనందరావు అధ్యక్షతన జరిగింది. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో మత్స్యకారవర్గాల్లో వర్గ వైషమ్యాలు సృష్టించి ఎన్నో అరాచకాలకు పాల్పడిందన్నారు. వైద్యకళాశాలల పేరిట అనవసర రాద్ధాంతం చేస్తూ వైసీపీ చేస్తున్న ఆందోళనలు అర్థరహితమన్నారు. 1994 నుంచి 2004 వరకు పాలన చేసిన సీఎం చంద్రబాబు తీసుకువచ్చిన సంస్కరణల్లో భాగంగానే పబ్లిక్, ప్రైవేటు, పార్టనర్‌షిప్‌తో చేస్తున్న వైద్యకళాశాలల నిర్మాణంవల్ల ప్రభుత్వానికిగానీ, ప్రజలపైగానీ ఏ భారం పడదన్నారు. చంద్రబాబు పారదర్శక పాలన అందిస్తున్నారని, ఇది చూసి ఓర్వలేక జగన్ నాయకత్వంలో ఆ పార్టీ శ్రేణులు రాష్ట్రంలో విధ్వంసాలు, అరాచకాలు, అలజడులు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాయని మంత్రి ఆరోపించారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ఎమ్మెల్యే ఆనందరావు చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించి చప్పట్ల రూపంలో ఆయనకు అభినందనలు తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ మత్స్యకార ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను ముందుండి ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ సభలో మరో ముఖ్య అతిథిగా పాల్గొన్న నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ అమరావతి రాజధానిని అద్భుతంగా నిర్మిస్తున్న చంద్రబాబు మంచి విజన్ ఉన్న నాయకుడన్నారు. ఆయన హయాంలో మత్స్యకారులు, అగ్నికుల క్షత్రియులకు అంతా మంచే జరుగుతుందని ఆకాంక్షించారు. మరో అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి, పాండిచ్చేరి రాష్ట్రానికి చెందిన మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించడానికి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. చమురు సంస్థల అన్వేషణవల్ల చేపలవేట సమయంలో మత్స్యకారులకు జరుగుతున్న అన్యాయాలను ప్రస్తావించి మంచి భవనం నిర్మాణానికి స్థానిక ప్రజాప్రతినిధులు చేస్తున్న కృషిని కొనియాడారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, కోనసీమ జిల్లా మహిళా నేత పెచ్చెట్టి విజయలక్ష్మి, లోక్‌సభ తెలుగు రైతు సంఘ అధ్యక్షుడు మట్టా మహలక్ష్మిప్రభాకర్, మత్స్యకార సంఘ నేత నాగిడి నాగేశ్వరరావు, వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కంచిపల్లి అబ్బులుతోపాటు ఫిషరీస్ శాఖకు చెందిన అధికారులు, మత్స్యకార సంఘ ప్రముఖ నాయకులు పెద్దసంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.2కోట్లతో నిర్మించే ఈ భవన నిర్మాణం త్వరితగతిన ప్రారంభం కావాలని కార్యక్రమానికి హాజరైన నేతలు ఆకాంక్షిస్తూ మాట్లాడారు.



మత్స్యకార భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే ఆనందరావు

రాష్ట్రస్థాయి స్వచ్ఛ అవార్డుకు లొల్ల ఎంపిక



- నేడు సీఎం సమక్షంలో అవార్డు

ఆత్రేయపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామం రాష్ట్రస్థాయి స్వచ్ఛఅవార్డుకు ఎంపికైంది. వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి అనుకుని ఉన్న ఈ గ్రామం పారిశుధ్యం నిర్మూలనలో ముందంజలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఐవీఆర్ఎస్ కాల్స్ సర్వే ప్రకారం రాష్ట్రస్థాయిలోనే లొల్ల గ్రామం ప్రథమస్థానంలో నిలిచింది. తద్వారా మరింత అభివృద్ధికి బాటలు పడనుంది. సర్పంచ్ కాయల జగన్నాథం, ఎంపీడీవో వెంకటరామన్, పంచాయతీ కార్యదర్శి కృష్ణామాచార్యులు వివిధశాఖల సిబ్బంది స్వచ్ఛతాహి కార్యక్రమంలో భాగంగా గ్రామప్రజల్లో అవగాహన కల్పించడం,పాఠశాలలో విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించడంఅవార్డుకు కారణమైంది. ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించడంతో మరీ ముఖ్యంగా ప్రజలు చెత్తను పంచాయతీ సమకూర్చిన డస్ట్‌బిన్లలో వేసి స్వచ్ఛతాహి కార్యక్రమానికి బాటలు వేశారు. సీఎం చంద్రబాబునుంచి సోమవారం అమరావతిలో లొల్ల సర్పంచ్ కాయలజగన్నాథం రాష్ట్రస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డును అందుకోనున్నారు. ఈ అవార్డు రావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన



పంచాయతీలో నిర్వహించే ప్రతి సమావేశంలోను గ్రామంలో అపారిశుధ్య నిర్మూలన రహితంగా తీర్చిదిద్దేదుకు కృషిచేద్దాం. ప్రతి నెల 3వ శనివారం స్వచ్ఛతహి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాం. గ్రామ ప్రజలంతా పూర్తిస్థా యిలో సహాయ సహకారాలు అందించడంతో ఈ అవార్డు దక్కింది.

-కాయల జగన్నాథం, సర్పంచ్, లొల్ల

మండపేట మున్సిపాల్టీకి స్వచ్ఛతాహి జిల్లాస్థాయి అవార్డు

మండపేట,అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛతాహి అవార్డుల్లో మండపేట మున్సిపాల్టీ జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. సీఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండపేట మున్సిపాల్టీ స్వచ్ఛతాహిలో ఎంపికైందని మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. తమ మున్సిపాల్టీలో స్వచ్ఛతాహిసేవలో భాగంగా శానిటరీ కార్మికులు బొట్టా సూరిబాబు, వడ్డాది దుర్గారావు ఉత్తమ స్వచ్ఛతాయోధులుగా ఎంపికయ్యారు. జిల్లా కలెక్టర్ సోమవారం స్వచ్ఛతాహి పురస్కారాలు అందజేస్తారని కమిషనర్ తెలిపారు.

త్వరలోనే పరిశ్రమను తెరిచి మంచి చేస్తాం

- రీజెన్సీ అధినేత జీఎన్ నాయుడు

యానాం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): యానాంలోని తీరప్రాంతగ్రామాలైన సావిత్రినగర్, గిరియాంపేట గ్రామాల్లో రీజెన్సీ అధినేత డాక్టర్ జీఎన్ నాయుడు పర్యటించారు. తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని, త్వరలోనే రీజెన్సీ పరిశ్రమ తిరిగి ప్రారంభించి ఉద్యోగావకాశాలు కల్పించాలని స్థానికులు కోరారు. అనంతరం ఆయన దరియాలతిప్పలో కొలువై ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అక్కడి ప్రజలతో మాట్లాడారు. రాబోయే రోజుల్లో పరిశ్రమను తెరిచి మీ అందరికీ మంచి చేస్తానని జీఎన్ నాయుడు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ యానాం అధ్యక్షుడు అర్థానిదినేష్, కాటంశెట్టి రామ్మూర్తి, దోమ ఆదినారాయణ, మల్లాడి లోవరాజు, సావిత్రినగర్ యువత అధ్యక్షుడు అశోక్, అప్పారావు పాల్గొన్నారు.

మద్యం మత్తు.. కారు, బైక్ చిత్తు

ఊరేగింపులో పేలిన బాణసంచా

- పురోహితులకు తీవ్రగాయాలు

5

- డీజేను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఆర్టీసీ బస్సును ఢీకొన్న మోటార్‌సైకిల్

5

- యువకుడి మృతి

చలో విశాఖపట్నం

- నేటినుంచి విద్యుత్ ఉద్యోగుల సమ్మె

అల్లవరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ విద్యుత్ ఉద్యోగులు సోమవారంనుంచి నిరవధిక సమ్మెకు 'చలో విశాఖపట్నం' పిలుపునిచ్చారు. డీఏ బకాయిలు, జీతాలు పెంచాలని అన్‌లిమిటెడ్ మెడికల్ అలవెన్సులు ఇవ్వాలని, ఈపీఎఫ్-2, జీపీఎఫ్‌లు ఇవ్వాలనే డిమాండ్‌తో యూనియన్ పిలుపునిచ్చింది. విశాఖపట్నంలో విద్యుత్ కార్పొరేట్ ఆఫీసు ముట్టడికి తరలిరావాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు ఎంవీ రమణ, డివిజన్ అధ్యక్షుడు దంగేటి నరేంద్ర ఆధ్వర్యంలో చలో విశాఖపట్నం ధర్నాకు వందలాదిగా విద్యుత్‌ఉద్యోగులు, ఏఈలు, కాంట్రాక్టు ఉద్యోగులు తరలివెళ్తున్నారని అల్లవరం ఏఈ బి. వెంకటేశ్వరరావు తెలిపారు.జిల్లానుంచి పది బస్సులు, కార్లు, ఇతర వాహనాల్లో వందలాదిగా విద్యుత్‌ఉద్యోగులు, ఇంజనీర్లు, కాంట్రాక్టు ఉద్యోగులు సోమవారం ధర్నాకు తరలివెళ్తున్నారన్నారు. ఈనెల 13న తమ డిమాండ్ల సాధనకు చలో విజయవాడకు యూనియన్ పిలుపునిచ్చిందన్నారు.

విద్యార్థులకు రూ.50లక్షల ఉపకార వేతనాల పంపిణీ



ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో కాత్వా ప్రతినిధులు

అమలాపురం రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి కోసం నిరంతరం శ్రమించడం ద్వారా అత్యుత్తమ సమాజాన్ని తద్వారా శక్తివంతమైన దేశాన్ని నిర్మించగలమని తులసీ సీడ్స్ అధినేత తులసి రామచంద్ర ప్రభు వివరించారు. అమలాపురం రూరల్ వేమవరంలోని సత్యనారాయణ గార్డెన్స్‌లో ఆదివారం కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(కాత్వా) ఆధ్వర్యంలో జరిగిన ఉపకార వేతన పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, మెడిసిన్ విద్యను అభ్యసిస్తూ ప్రతిభ కనబరిచిన 650మంది విద్యార్థులకు రూ.50లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఆలివ్ స్వీట్స్ అధినేత ఆలివ్ దొరరాజు గతేడాది పది పరీక్షల్లో 596 మార్కులు సాధించిన పెద్దిరెడ్డి మోహనకృష్ణసాత్విక్‌కు రూ. లక్ష నగదు పురస్కారాన్ని అందించారు. సమావేశానికి హాజరైన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ విద్య తరగని ఆస్తి అని ఎవరైతే ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దబడతారో వారే సమాజానికి అద్భుతమైన వనరులుగా మారతారని కొనియాడారు. ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ కాత్వా ఆధ్వర్యంలో రూ.50లక్షలు సమీకరించి ఉపకార వేతనాలు పంపిణీ చేయడం చారిత్రాత్మక ఘట్టమని అభినందించారు.చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, బంగిగుప్తాపు పాండురంగ, అంతర్జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిట్నీడి నిరంజని, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొల్లా నారాయణరావు, రాష్ట్ర అధ్యక్షుడు లీలా మాధవరావు, ప్రధాన కార్యదర్శి బంగారురాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైనరుబాబు, జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవోగా సత్యకుమార్



అమలాపురం టౌన్, అక్టోబరు 5(ఆంధ్ర జ్యోతి): పెళ్లిళ్ల వెంకన్నగా పేరొందిన అమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా పీవీవీ సత్యకుమార్‌ను నియమించారు. ఈయన గతంలో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సూపరింటెండెంట్‌గా, కాకినాడ అన్నసమాజం సూపరింటెండెంట్‌గా పనిచేశారు. అనంతరం సత్యకుమార్‌కు గ్రేడ్-1 ఈవోగా పదోన్నతి లభించింది. పదోన్నతిలో భాగంగా ఆయన్ను అమలాపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా నియమించారు. ఆలయ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సత్యకుమార్ మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఇప్పటివరకు ఇక్కడ తాళ్లరేవు గ్రూప్ టెంపుల్స్ ఈవో యర్రా వెంకటేశ్వరరావు అదనపు బాధ్యతలు నిర్వహించారు.



ఆకాశంలో వహ్..లయం

ఆకాశంలో మార్పు.. తర్వాత వర్షం.. అనంతరం వలయం... యానాంలో ఆదివారం మధ్యాహ్నం ఆకాశంలో వలయం ఏర్పడ్డ దశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా... - యానాం (ఆంధ్రజ్యోతి)

'జలజీవన్ మిషన్'పై నేటి నుంచి శిక్షణ తరగతులు

సామర్లకోట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు గ్రామీణ నీటిపారుదల విభాగం ఏఈఈలు, డిప్యూటీ ఎంపీడీవోలకు కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ఆవరణలో సోమవారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ కేవీవీ ప్రసాదరావు తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన 402 మంది అధికారులకు ఈనెల 17 వరకు బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇస్తామన్నారు. విస్తరణ శిక్షణ కేంద్రంలో బోధన, వసతి, భోజన సదుపాయాలను ప్రిన్సిపాల్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ సూర్యనారాయణస్వామి, ఏఈఈ వెంకటసాయి రామ్, ఫ్యాకల్టీలు పర్యవేక్షించారు.

తునిలో విషాదం

ఏరియా ఆసుపత్రిలో కవలలకు జన్మనిచ్చి బాలింత మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన



తునిలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు



మరణించిన బాలింత రత్నకుమారి



ఆసుపత్రి ఎదుట బంధువులు

తుని రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో విషాదం జరిగింది. ఓ బాలింత పండంటి కవలలకు జన్మనివ్వగా ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. ఆ తల్లి కొన్ని గంటల్లోనే మృతిచెందింది. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి బాలింత మృతికి కారణమయ్యారని బంధువులు ఆరోపించారు. వివరాల్లోకి వెళితే... తుని మండలం టి.తిమ్మాపురం గ్రామానికి చెందిన కాపరపు రత్నకుమారి (29)నెలలు నిండడంతో కుటుంబసభ్యులు శుక్రవారం ఆసుపత్రికి తీసుకొచ్చారు. శనివారం ఉదయమే ఆమెకు డెలివరీ అయింది. ఇద్దరు కవల మగబిడ్డలకు జన్మనిచ్చింది. అనంతరం ఆసుపత్రి సిబ్బంది వార్డుకు తరలించారు. అయితే కొద్దిసేపటికే రత్నకుమారికి రక్తస్రావం ప్రారంభమైందని ఎన్నిసార్లు చెప్పినా వైద్యులు, సిబ్బంది కానీ పట్టించుకోలేదని బంధువులు తెలిపారు. సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసినా ఆమె నుంచి కనీస స్పందన లేకపోయిందని చెప్పారు. రాత్రి అత్యవసరంగా కాకినాడ తీసుకెళ్లాలని సిబ్బంది చెప్పారని, అంబులెన్స్‌లో కాకినాడ తీసుకెళుతుంటే అన్నవరం చేరుకునే సరికి పరిస్థితి మరింత విషమించిందని అంబులెన్స్ సిబ్బంది సూచనల మేరకు మళ్లీ తుని ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చినట్టు బంధువులు తెలిపారు. అయితే అప్పటికే ఆమె మరణించిందని చెప్పకుండా ఆసుపత్రి సిబ్బంది కొద్దిసేపు చికిత్స చేసినట్టు నటించారని ఆరోపించారు. పరిస్థితి బాగోకపోతే సకాలంలో చెప్తే సరిపోయేదని, వారు పట్టించుకోకుండా బాలింత మృతికి కారణమయ్యారని బంధువులు ఆరోపించారు. తమకు న్యాయం జరగాలని ఆసుపత్రి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఏరియా ఆసుపత్రికి భారీ సంఖ్యలో మృతురాలి బంధువులు, తిమ్మాపురం గ్రామస్తులు చేరుకోవడంతో ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. బంధువుల రోదనలతో ఏరియా ఆసుపత్రి ప్రాంగణం విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డుపై బైఠాయింపు

బాలింత మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాలింత బంధువులు, తిమ్మాపురం గ్రామస్తులు తుని ఏరియా ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. రోడ్డుపై టెంట్ వేసి బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో పెద్దాపురం డీఎస్పీ, స్థానిక పోలీసులు ఆసుపత్రికి చేరుకుని ఆందోళన విరమించాలని వారి చెప్పే ప్రయత్నం చేసినా ఫలితంలేకపోయింది. స్థానిక నాయకులు, ఆసుపత్రి అధికారులు బాలింత బంధువులతో పలు దఫాలు చర్చలు నిర్వహించి నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. ఆందోళన విరమించి బాలింత మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

విచారణకు కలెక్టర్ ఆదేశం

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తుని ఏరియా ఆసుపత్రిలో ఆదివారం తెల్లవారుజామున బాలింత మృతి చెందడంపై విచారణ చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టాలన్నారు. తుని ఏరియా ఆసుపత్రిలో వైద్యుల లోపాలపై సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ నిర్బంధం

రాజమహేంద్రవరం షెల్టాన్ హోటల్‌లో అడ్డుకున్న పోలీసులు

హైకోర్టు అనుమతి తీసుకుని వారంలో రాజయ్యపేట వెళ్తానన్న యాదవ్



హోటల్ షెల్టాన్‌లో రామచంద్రయాదవ్‌ను బయటకు రాకుండా అడ్డుకుంటున్న పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్‌ను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం హోటల్ షెల్టాన్‌లో పోలీసులు నిర్బంధించారు. వివరాల్లోకి వెళితే... అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తున్న బాధితులకు అండగా నిరసనకు పిలుపునిచ్చిన బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ ఆదివారం నక్కపల్లి బయలు దేరి వెళ్తూ మార్గం మధ్యలో రాజమహేంద్రవరం చేరుకుని హోటల్ షెల్టాన్‌లో బసచేశారు. తిరిగి నక్కపల్లి బయలుదేరుతున్న సమయంలో జిల్లా పోలీసులు షెల్టాన్‌కు చేరుకుని నోటీసు జారీ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా నక్కపల్లి వెళ్లడానికి వీలులేదని పోలీసులు సూచించారు. దీంతో పోలీసులకు, రామచంద్రయాదవ్ వ్యక్తిగత సెక్యూరిటీ సిబ్బందికి మధ్య వాగ్వాదం జరిగింది. గదిలోంచి బయటకు వచ్చిన రామచంద్రయాదవ్‌ను పోలీసులు అడ్డుకోవడంతో ఆయన పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కరేడు, ఉదయగిరిలలో ఇదేవిధంగా పోలీసులను అడ్డం పెట్టుకుని బాధితులను అణిచివేశారన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావాలంటే లక్షలాది ఎకరాల బీడుభూములు ఉన్నాయని, వ్యవసాయ భూములు, తీర ప్రాంతాల భూములు పరిశ్రమలకు తీసుకోవాలంటే బీసీవై పార్టీ ఊరుకోదని స్పష్టం చేశారు. నక్కపల్లిలో జరుగుతున్న దానిని స్థానికులు అడ్డుకుంటుంటే వారికి అండగా నిలిచేందుకు తాము వెళ్తుంటే దారుణంగా నిర్బంధం విధించడం అన్యాయమన్నారు. జరిగిన సంఘటనపై అవసరమైతే కేంద్రప్రభుత్వంతో మాట్లాడతానని యాదవ్ అన్నారు. వారం రోజుల్లో హైకోర్టులో అనుమతి తీసుకుని రాజయ్యపేట గ్రామం వెళ్తానని చెప్పారు. అనంతరం ఆయన రాజమహేంద్రవరం నుంచి వెనుదిరిగారు.

ఆర్టీసీ బస్సు, మోటార్‌సైకిల్ ఢీ యువకుడి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

కోనసీమ జిల్లా బండారులంక శివారు సంఘటన





ప్రమాదంలో మరణించిన శేషగిరి (ఫైల్)

అమలాపురం రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం బండారులంక శివారు చినచంద్రాపురంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. తాలూకా ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు తెలిపిన వివరాలివి... సమనస గ్రామానికి చెందిన లింగోలు శేషగిరి (22), చవ్వాకుల దుర్గాచరణ్‌లు ఆదివారం దుర్గాచరణ్ అమ్మమ్మ ఊరు అయిన ఈదరపల్లి వెళ్లారు. తిరిగి మోటార్‌సైకిల్‌పై అంబాజీపేట వెళ్తుండగా రాజమహేంద్రవరం నుంచి అమలాపురం వస్తున్న ఆర్టీసీ పల్లెవెలుగు బస్సును ఎదురుగా మోటార్‌సైకిల్ ఢీకొంది. ఏజీ రోడ్డులో షిరిడిసాయిబాబా ఆలయం సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో శేషగిరి అక్కడికక్కడే మృతిచెందాడు. దుర్గాచరణ్‌కు తీవ్ర గాయాలు కావడంతో 108లో అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ శేఖర్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

ఊరేగింపులో బాణసంచా పేలి పురోహితులకు తీవ్రగాయాలు

డీజేను స్వాధీనం చేసుకున్న పోలీసులు





గాయాలపాలైన పురోహితులు

పి.గన్నవరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఊరేగింపులో ప్రమాదవశాత్తు బాణసంచా (జువ్వలు) పేలి అమ్మవారి సేవ చేసే పురోహితులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... దసరా ఉత్సవాల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం మానేపల్లి శివారు శివాయిలంకలో, మానేపల్లి సెంటర్‌లో గల అమ్మవార్లకు ఊరేగింపు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో శనివారం రాత్రి పదిగంటల సమయంలో శివాయిలంక ఊరేగింపు సెంటర్‌కి చేరుకోవడంతో కొంతమంది యువకులు జువ్వలు వేస్తున్నారు. అదే సమయంలో సెంటర్‌లో మరక అమ్మవారిని ట్రాక్టర్‌పై ఊరేగిస్తున్నారు. అవతల ఊరేగింపు నుంచి వచ్చిన జువ్వ ట్రాక్టర్లో పడడంతో ట్రాక్టర్లో ఉన్న జువ్వలకు నిప్పురవ్వలు అంటుకుని ఒక్కసారిగా పేలుడు సంభవించింది. దీంతో ట్రాక్టర్లో అమ్మవారికి సేవచేస్తున్న పురోహితులు రత్నాగోపాల్ (30), వి.విజయప్రసాద్(50)కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు హుటాహుటిన అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను ఆదివారం పోలీసులు, దేవస్థానం అధికారులు పరామర్శించి వైద్యులతో మాట్లాడారు. ఊరేగింపు సమయంలో ఉన్న డీజేను పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. స్థానికుల సమాచారం మేరకు వివరాలు సేకరిస్తున్నామని, దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ బి.శివకృష్ణ తెలిపారు. యువత ఆజాగ్రత్త ఇద్దరు పురోహితుల ప్రాణాలమీదకు వచ్చిందని స్థానికులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

రెండోరోజు బ్రెజిల్ బృందం పర్యటన

ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతుల పరిశీలన



కొవ్వూరు: దొమ్మేరులో పంటలను పరిశీలిస్తున్న బ్రెజిల్ బృందం



దేవరపల్లి: కురుకూరులో ఖోఖోపంటను పరిశీలిస్తున్న దృశ్యం

కొవ్వూరు/దేవరపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో బ్రెజిల్ బృందం సభ్యులు రెండోరోజు సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులను పరిశీలించారు. ఆదివారం కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో నీరుకొండ సత్యనారాయణ ప్రకృతి వ్యవసాయక్షేత్రాన్ని సందర్శించారు. అనంతరం కాపవరం, ధర్మవరం గ్రామాల్లో పర్యటించి పంటల సాగులో అవలంబిస్తున్న విధానాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ శాఖ అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మహబూబ్ వల్లీ మాట్లాడుతూ జర్మనీకి చెందిన రైతులు, ఏజన్సీ ప్రతినిధులు బ్రెజిల్ మంత్రిత్వ శాఖకు చెందిన ప్రతినిధులు సుమారు 27 మంది డెలిగేట్స్ కొవ్వూరు మండలం దొమ్మేరు, కాపవరం, ధర్మవరం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారని, రైతులతో మాట్లాడి వ్యవసాయ పద్ధతులను అడిగి తెలసుకున్నారని పేర్కొన్నారు. సందేహాలను నివృత్తి చేసుకోవడం జరిగిందన్నారు. వ్యవసాయశాఖ ఏడీ సిహెచ్.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి ఏ.గంగాధర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. బ్రెజిల్ బంద సభ్యులు దేవరపల్లి మండల కురుకూరు, యర్నగూడెం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ రైతు సాధికారితపై పరిశీలించి రైతులు, అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారులు ఎస్.మాధవరావు, కొవ్వూరు ఏడీఏ శ్రీనివాస్, రైతు సాధికార సంస్థ అధికారులు మధుసూధనరావు, జాకీర్ హుస్సేన్, ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ తాతారావు, అడిషనల్ జిల్లా మేనేజర్ వల్లి, మండల వ్యవసాయాధికారి కే.కమలరాజు, ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారి సతీశ్, రైతులు గద్దే మునేశ్వరరావు, భాస్కరరావు, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ కంపెనీ ఒత్తిడి తట్టుకోలేక ఉరేసుకున్న యువకుడు



కృష్ణ (ఫైల్)

కొవ్వూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్ కంపెనీ ఒత్తిడి తట్టుకోలేక యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం వాడపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. వాడపల్లి గ్రామానికి చెందిన అమలాపురం కృష్ణ(25) తాపీపని చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. 4నెలల క్రితం రాజమహేంద్రవరంలో ఒక ప్రైవేటు వెహికల్ ఫైనాన్స్‌లో రూ.9000 చెల్లించి ఫైనాన్స్‌పై స్కూటీ కొనుగోలు చేశాడు. మూడు వాయిదాలు చెల్లించకపోవడంతో ఈ నెల 4న ఉదయం ఫైనాన్స్ కంపెనీ ఏజెంట్లు ఇంటికొచ్చి వాయిదా సొమ్ము చెల్లించాలని ఒత్తిడి చేశారు. సోమవారం చెల్లిస్తానని చెప్పినప్పటికి ఇబ్బందిపెట్టి సోమవారం చెల్లించని పక్షంలో చంపుతామని బెదిరించారు. దీనిపై మనస్తాపం చెందిన కృష్ణ ఆదివారం మధ్యాహ్నం ఇంటిలో ఫ్యాన్ ఉక్కుకు టవల్, లుంగీ కలిపి కట్టుకుని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుడి తండ్రి అమలాపురం సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణ సీఐ పి.విశ్వం సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసినట్టు సీఐ విశ్వం తెలిపారు.

గోదావరిలో దూకిన వ్యక్తి

మలికిపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా సఖినేటిపల్లికి చెందిన మేడిది సుదర్శనరావు (35) దిండి-చించినాడ వంతెనపై నుంచి దూకేశాడు. బైక్, సెల్‌ఫోన్‌ను వంతెనపై వదిలాడు. ఇది చూసిన స్థానికులు బంధువులకు సమాచారం అందించారు. అతడికి భార్య, కుమార్తె ఉన్నారు. మలికిపురం పోలీసులను వివరణ కోరగా ఏ సమాచారం లేదని తెలిపారు.

మస్కట్ నుంచి సురక్షితంగా స్వస్థలానికి...

కోనసీమ మహిళ రాక

అమలాపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మస్కట్ దేశంలో ఇంట్లో పనికోసం వెళ్లి అక్కడ ఇబ్బందులు పడుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం గ్రామానికి చెందిన ఎస్కేఎం బేబిని సురక్షితంగా స్వస్థలానికి తీసుకువచ్చారు. పిఠాపురానికి చెందిన నాగలక్ష్మి ద్వారా గత మే నెలలో ఉపాధి నిమిత్తం మస్కట్ వెళ్లిన బేబికి అక్కడ తలెత్తిన ఇబ్బందుల నేపథ్యంలో కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ నోడల్ అధికారి కె.మాధవి, సమన్వయ అధికారి జి.రమేష్ సహకారంతో మస్కట్ నుంచి ఆమె స్వస్థలానికి వచ్చినట్టు కలెక్టర్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. మస్కట్‌లో వంట చేసి ఉపాధి పొందే బేబికి అక్కడ ప్రమాదవశాత్తూ కాలుజారి పడిపోవడంతో బలమైన గాయం తగిలి పనిచేయలేని స్థితిలో ఇబ్బందులు పడుతుంది. అక్కడి నుంచి స్వస్థలానికి రావాలని పనికి కుదుర్చుకున్న యజమాని ఆమెను హవాలా ఆఫీసులో వదిలి వెళ్లాడు. ఆమెను స్వదేశానికి పంపాలంటే ప్రయాణ చార్జీలు చెల్లిస్తేనే గానీ ఇండియాకు పంపడం కుదరదని చెప్పడంతో బాధితురాలు బంధువులు సుమారు రూ.లక్ష సమకూర్చారు. అయితే అవి సరిపోకపోవడంతో కలెక్టర్ మహేష్‌కుమార్‌ను సహాయం కోసం వినతి ఇచ్చారు. దాంతో స్పందించిన కలెక్టర్ మహేష్‌కుమార్‌కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌కు ఆదేశాలు జారీ చేయగా మస్కట్‌లోని హవాలా కార్యాలయంతో పూర్తిస్థాయిలో సంప్రదింపులు జరిపి బేబిని మస్కట్ నుంచి స్వస్థలానికి తీసుకురావడం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి కె.మాధవి, సమన్వయ అధికారి గోళ్ల రమేష్‌లు తెలిపారు.



మస్కట్ నుంచి స్వస్థలానికి వచ్చిన బేబితో మాట్లాడుతున్న సమన్వయ అధికారి రమేష్

'లోవ'లో భక్తుల కోలాహలం

ఆలయానికి రూ.4.43 లక్షల ఆదాయం



భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ



భక్తులతో సందడిగా మారిన ఆలయ ప్రాంగణం

తుని రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. ప్రత్యేక క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా దేవస్థానం ఏర్పాటు చేసిన వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.4.43 లక్షల ఆదాయం వచ్చినట్టు ఈవో విశ్వనాథ రాజు తెలిపారు.

సత్యదేవుడికి రథోత్సవం

అన్నవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వారాంతపు ఆర్జితసేవయిన రథోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. ప్రధానాలయం నుంచి స్వామి,అమ్మవార్లను తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చి సర్వాంగసుందరంగా పుష్పాలతో అలంకరించిన రథంపై ఆశీనులు గావించారు. ప్రత్యేక పూజల అనంతరం చైర్మన్ రోహిత్ టెంకాయి కొట్టి రథసేవను ప్రారంభించారు. పండితుల మంత్రోచ్చరణలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు పాల్గొన్నారు.

మద్యం మత్తు... కారు, బైక్ చిత్తు!

కారుపైకి దూసుకెళ్లి కూర్చుండిపోయిన యువకుడు

ఆలమూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల వద్ద జాతీయ రహదారిపై ఒక యువకుడు రాంగ్ రూట్‌లో బైక్ నడుపుతూ మద్యం మత్తులో అతివేగంగా వస్తున్న కారుపైకి దూసుకెళ్లాడు. బైక్ నేరుగా ఎదురుగా వస్తున్న కారును ఢీకొనడంతో కారు ముందు భాగం (బానెట్, బంపర్) తీవ్రంగా దెబ్బతిన్నాయి. బైక్ పూర్తిగా ధ్వంసమైంది. బైక్ నడుపుతున్న యువకుడు కారు బానెట్‌పై, విండ్‌షీల్డ్ పగిలిన చోట కూర్చుండిపోయాడు. ప్రమాదం జరిగిన సమయంలో యువకుడు మద్యం తాగి ఉన్నాడని స్థానికులు తెలిపారు. రోడ్డుపై వాహనాలు రాకపోకలు నిలిచిపోగా స్థానికులు, ప్రయాణికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



ఆలమూరు మండలం చొప్పెల్ల హైవేపై బైక్‌తో ఢీకొని కారుపైకి ఎక్కిన యువకుడు

రోలర్ స్కేటింగ్ పోటీలు



రోలర్ స్కేటింగ్ పోటీలకు సిద్ధపడుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న సెక్రటరీ, పీడీలు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అండర్-14, 17 స్కూల్ గేమ్స్ ఎంపికల్లో భాగంగా ఆదివారం తూరంగిలో రోలర్ స్కేటింగ్ పోటీలను జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, పి.సుధారాణి పర్యవేక్షణలో నిర్వహించారు. వ్యాయామోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి మాచరిరావు, కోశాధికారి నాగలింగేశ్వరరావు, ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ రవిరాజు, పీడీలు పట్టాభిరామం, శ్రీహరిరాజు, అప్పారావు, రవి, దుర్గాప్రసాద్, హుస్సేన్ పోటీలను పర్యవేక్షించారు.

రేపు ఎన్టీఆర్ బీచ్‌లో వాలీబాల్, రగ్బీ, హ్యాండ్‌బాల్ పోటీలు

అండర్-14, 17 స్కూల్ గేమ్స్ ఎంపికల్లో భాగంగా సోమవారం ఎన్టీఆర్ బీచ్‌లో బీచ్ వాలీబాల్, రగ్బీ, హ్యాండ్‌బాల్ పోటీలు జరుగుతాయని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, పి.సుధారాణి తెలిపారు. ఆసక్తి గలవారు ఉదయం 9 గంటలకు జిల్లా క్రీడా మైదానంలో రిపోర్టు చేయాలని సూచించారు. ఎన్టీఆర్ బీచ్ వరకు బస్సు సౌకర్యం కల్పించామన్నారు. అండర్-17 బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీలు జి.మామిడాడలో జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు 9059317248, 9603504347 నెంబర్లను సంప్రదించాలని వారు సూచించారు.

అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

అంతర్వేది, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి):అంతర్వేది పాలెం మధ్యగ్రూపు మోడల్ ప్రాథమిక పాఠశాలలో స్వర్ణభారతి సాహిత్యకళావేదిక అధ్యక్షుడు రాజారావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈవో ఎం.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగావిచ్చేసి అవార్డు పొందిన 11మంది ఉపాధ్యాయులను సన్మానించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

అంబాజీపేట,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడామైదానంలోజరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14విభాగంలో తైక్వాండో పోటీల్లో అంబాజీపేటకు చెందిన కె.సుందరిప్రియ, ఇషాశ్రీ నిజ, ఎం.మౌనిక, బి.హేమహృతిక్, పి.చరణ్యశ్రీలు ప్రతిభచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

సాహితీ కళా పీఠం ఆధ్వర్యంలో కవితా పోటీలు

అంబాజీపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట సాహితీ కళా పీఠం ఆధ్వర్యంలో కవితా పోటీలు నిర్వహిస్తున్నట్లు అరిగెల బలరామమూర్తి తెలిపారు. రహదారి భద్రత- ప్రమాదాల నివారణపై 25లైన్లు మించకుండా కవిత ఉండాలన్నారు. అక్టోబరు 31వ తేదీలోపు అందించాలన్నారు. రూ.5116 బహుమతితో పాటు అవార్డును అందిస్తామన్నారు. కవితలను సాహితి కళాపీఠం బస్టాండ్ వద్ద ఉన్న కార్యాలయానికి అందించాలన్నారు.

ఆర్థిక సాయం

అంబాజీపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మాచవరానికి చెందిన పితాని ఏసుకుమార్ కిడ్నీవ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో రాజోలుకు చెందిన బోనం రాజు, సూరపురెడ్డి సురేష్ రూ.3వేలు విలువైన రూ.6500 కిరాణా సరుకులు అందించారు. కోకోఫెడ్ ఛైర్మన్ అరిగెల బలరామమూర్తి, అరిగెల కృష్ణప్రసాద్, అన్యం రాంబాబు, అరిగెల రాంబాబు కలిసి రూ.25వేలు అందించారు.

రైతులకు మరిన్ని సేవలందించేందుకు కృషి చేయాలి

మామిడికుదురు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. పాశర్లపూడి పీఏసీఎస్ త్రిమెన్ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే ఆదివారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఛైర్మన్‌గా మందా గాంధీ, సభ్యులుగా బొంతు మహాలక్ష్మి నాగకుమారి, యర్రంశెట్టి దుర్గారాజేశ్వరిలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి సొసైటీ ద్వారా అన్ని సేవలు అందించాలన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నానన్నారు. అందరికీ అందుబాటులో ఉంటానని, ఎవరికి అవసరం వచ్చినా తనకు కాల్ చేస్తే స్పందిస్తానన్నారు. జడ్పీ మాజీచైర్మన్ నామన రాంబాబు, ఏఎంసీ ఛైర్మన్ పెనుమాల లక్ష్మి, సర్పంచ్ అడబాల తాతకాపు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు జాలెం శ్రీనివాసరాజా, మామిడికుదుర సొసైటీ అధ్యక్షుడు ఈలి శ్రీనివాస్, ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, మద్దాల తమ్మన్న, శిరిగినీడి వెంకటేశ్వరరావు, కొమ్ముల కొండలరావు, చుట్టుగుళ్ల కిశోర్, మల్లాడి విష్ణు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



పాశర్లపూడి సొసైటీ త్రిమెన్ కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఏఎంసీ ఛైర్మన్ కేతా



రాజోలు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విజయవాడలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను రాజోలు ఏఎంసీ ఛైర్మన్ కేతా వెంకటలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఎంసీ ఛైర్మన్‌గా తనను నియమించినందుకు మంత్రి లోకేశ్‌కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాజోలు నియోజకవర్గం గురించి చర్చించారని ఆమె తెలిపారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి, నియోజకవర్గంలో టీడీపీ పటిష్టతకు మరింతగా కృషి చేయాలని మంత్రి లోకేష్ సూచించారని ఆమె తెలిపారు.

విఘ్నేశ్వరస్వామి అన్నప్రసాద ట్రస్టుకు విరాళం

అయినవిల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి అన్నప్రసాద ట్రస్టుకు పి.గన్నవరం మండలం పెదపూడికి చెందిన బొరుసు వీరవెంకట సత్యనారాయణ-రమాదేవి దంపతులు రూ.51,116 విరాళంఅందజేశారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు.

మీడియా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా సుధీర్



అల్లవరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా కాకర సుధీర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఢిల్లీబాబురెడ్డి ప్రకటించారు. కొమరగిరిపట్నానికి చెందిన ఏబీఎన్ దేశం చానల్ ఉభయ గోదావరి జిల్లాల కరస్పాండెంట్ కాకర సుధీర్‌ను నియమిస్తూ విజయవాడ మీడియా ఫెడరేషన్ ప్రధాన కార్యాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో నిర్ణయించారు.

ప్రకృతి వ్యవసాయంతో అనేక ప్రయోజనాలు

మామిడికుదురు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో రైతులకు అనేక ప్రయోజనాలు చేకూరతాయని, ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలని అడిషనల్ డీపీఎం సత్యనారాయణ అన్నారు. ఈదరాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను ఆయన ఆదివారం పరిశీలించారు. రైతులకు పంచగవ్య స్ప్రేయింగ్‌పై అవగాహన కల్పిస్తూ ఐదు ఎకరాల విస్తీర్ణంలో 25లీటర్ల పంచగవ్య స్ప్రేయింగ్ చేయడం వల్ల గింజ గట్టిబడి దిగుబడి గణనీయంగా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు యెరుబండి లక్ష్యయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కుడుపూడి జానకి, చెల్లుబోయిన రాధ పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో భారీ వర్షం

ముమ్మిడివరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఒక్కసారిగా ఆకాశమై మేఘావృతమై మధ్యాహ్నం 2.30గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో రోడ్లన్నీ నీట మునిగాయి. రోడ్లు, డ్రెయిన్లు వర్షం నీటితో ఏకమయ్యాయి. ముమ్మిడివరంలోని ఆసుపత్రుల వీధి, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ రోడ్డు, కుమ్మర్లవీధి, ఆర్టీసీ బస్టాండు రోడ్డు, జీఎంసీ బాలయోగి కాలనీ, తహశీల్దార్, పోలీసుస్టేషన్ కార్యాలయాల ఆవరణలు వర్షంతో నీట మునిగాయి. భారీ వర్షానికి రోడ్లు నీట మునిగాయి.

నిత్యాన్నదానానికి రూ.50వేలు విరాళం

అంతర్వేది, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరుకు చెందిన అప్పల లక్ష్మీకామేశ్వరి రూ.50,002విరాళంఅందించారు.

సాహితీయోధులతో సామాజిక చైతన్యం

అమలాపురంటౌన్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): సామాజిక చైతన్యం కోసం కలం పట్టిన యోధులు సాహితీ వనంలో ఎందరో ఉన్నారని శ్రీశ్రీకళావేదిక ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ పేర్కొన్నారు. తెలుగు సాహిత్యంలో ప్రముఖంగా ముగ్గురు కవులు సమాజంలోని అసమానతలను ఎండగడుతూ శాస్త్రీయ దృక్పథంతో సామాజిక చైతన్యం కోసం రచనలు సాగిస్తూ జీవితాంతం పోరాడారని వివరించారు. అటువంటి మహనీయుల సాహిత్యం నేటి తరాలకు ఆదర్శం కావాలని, వారి సాహిత్య బాటలో సామాజికంగా పయనించాలని పలువురు కవులు, రచయితలు పిలుపునిచ్చారు. తెలుగు అసోసియేషన్ అకాడమీ ఆఫ్‌రికార్డ్స్, ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం భూపయ్య అగ్రహారంలో కోనసీమ మహిళా మండలి భవనంలో దళిత తేజాలు పేరిట జాతీయ సాహితీ సదస్సు ఘనంగా నిర్వహించారు. సంస్థ అధ్యక్షురాలు కె.ఉషాజ్యోతి అధ్యక్షతన జరిగిన సదస్సులో కవులు సామాజిక కవికుసుమ ధర్మన్న, సమానత్వం కోసం కలంతో పోరాడిన కవి గుర్రం జాషువా, సామాజిక చైతన్యం కోసం నిరంతరం కలంతో పోరాడిన కవి శిఖరం పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న జీవితం సాహిత్యం అనే అంశంపై జాతీయ సాహిత్య సదస్సు నిర్వహించారు. పలువురు కవులు, రచయితలు, సాహితీవేత్తలు పత్ర సమర్పణ చేశారు. ఈసందర్భంగా వారి సాహిత్యంపై కొందరు విమర్శకులు విశ్లేషణ చేశారు. సదస్సుకు కన్వీనర్లగా బీవీవీ సత్యనారాయణ, నల్లా నరసింహమూర్తిలు వ్యవహరించగా శ్రీశ్రీకళావేదిక ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అరిగెల బలరామమూర్తి, రవిచంద్ర, సబ్బెల్ల వెంకటమహాలక్ష్మిరెడ్డి, ఎం.నాగభూషణం, కోరుకొండ జాన్, పాలమూరు వెంకట్, జె.రాజబాబు, జర్నలిస్టు ముక్కామల చక్రధర్, బి.ప్రకాశరావు, వైఆర్కే నాగేశ్వరరావు, బొలిశెట్టి అనసూయ, కడలి సత్యనారాయణ పాల్గొన్నారు. కవులనుసత్కరించారు.

రీసర్వేను సద్వినియోగం చేసుకోండి

మలికిపురం, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపడుతున్న రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ టి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కత్తిమండ, బట్టేలంక పంచాయతీల్లో ఏర్పాటుచేసిన రీసర్వే గ్రామసభల్లో ఆయన మాట్లాడుతూ భావి తరాలకు రీసర్వే ప్రాముఖ్యతను వివరించారు. భూయజమానులందరూ సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. వందేళ్ల క్రితం ఉన్నటువంటి సర్వే వివరాలను మళ్లీ రీసర్వే ద్వారా పొందు పరుస్తున్నట్టు ఆయన చెప్పారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

మూలస్థానం వరకు...
సర్వీసు రోడ్డు పొడిగించాలి


మూలస్థానంలో స్థానిక కూటమి నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ సోము

ఆలమూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మడికి నుంచి చొప్పెల్ల వరకు జాతీయ రహదారిపై సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారని పలువురు నాయకులు తెలిపారు. అయితే నిత్యం రద్దీగా ఉండే మూలస్థాన అగ్రహారం వరకు సర్వీసు రోడ్డును పొడిగించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు టీడీపీ మండల అధ్యక్షుడు ఈదల సత్తిబాబుతోపాటు పలువురు నాయకులు కోరారు. ఆల మూరు మండలం మూలస్థానం వచ్చిన ఎమ్మె ల్సీతో స్థానిక కూటమి నాయకులు చర్చించారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రదేశంగా మూలస్థానం ఉందని సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయ డం వల్ల ప్రమాదాల నివారణ జరుగుతాయని ఎమ్మెల్సీకి వారు వివరించారు. దీనిపై నేషనల్ హైవే అధికారులతో చర్చిస్తానని ఎమ్మెల్సీ చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సుంకర శ్రీరాములు, నాగిరెడ్డి స్వామి, సలాది జయప్రకాష్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో పేదలకు ఎన్నో ప్రయోజనాలు

ఆలమూరు (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాల వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్సీ అన్నారు. మూలస్థాన అగ్రహారంలో ఆదివారం వెంకటేశ్వర సొసైటీ అధ్వర్యంలో సొసైటీ చైర్మన్ తోట వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరం సుభద్ర హాస్పటల్స్, గౌతమి నేత్రాలయం, డాక్టర్ ఆకుల దుర్గాప్రసాద్ డయాబెటిస్ అధ్వర్యంలో జరిగిన మెగా వైద్య శిబిరంలో పలు రకాలు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, సర్పంచ్ లంక వరప్రసాద్, గానుగుల చిన్న, సలాది జయప్రకాష్ నారాయణ, ఆకుల సత్తియ్య, రేలంగి వీరాస్వామి, ఇనపకోళ్ల రామకృష్ణ, పట్టపగలు వీరాస్వామి పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.


రావులపాలెం పశువైద్యశాల వద్ద నినాదాలు చేస్తున్న ఏపీ ఎన్జీవో కార్యవర్గం

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

రావులపాలెం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, సరెండర్ లీవ్ బిల్లులు క్లియర్ చేయడంతో పాటు పీఆర్సీ కమిషన్ ఏర్పాటు, ఐఆర్ ప్రకటన వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఎన్జీవో కార్యవర్గ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. రావులపాలెం పశువైద్యశాల వద్ద కొత్తపేట తాలుకా యూనిట్ అధ్యక్షుడు మోటూరి రామారావు ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. దీనికి ఏపీ ఎన్జీవో మాజీ అధ్యక్షుడు, జిల్లా ఉద్యోగుల సమన్వయకర్త మాధవరపు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో పెండింగ్ బిల్లులకు సంబంధించి ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమా ండ్ చేస్తూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో కొత్తపేట మాజీ అధ్యక్షుడు కొవ్వూరి ప్రభాకరరెడ్డి, కార్యదర్శి నల్లా రామారావు, యేపుగంటి సురేష్, శ్యాముల్, చంద్రశేఖర్, అనసూయ, స్వర్ణకుమారి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన కూచిభట్ల శ్రీగిరి, సుధ దంపతులు రూ.1,11,116 విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం అందజేశారు. ఆలయంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను డీసీ సూర్యచక్రధరరావు పరిశీలించారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తజనం స్వామివారిని దర్శించుకున్నారు.


అన్నదానానికి విరాళం ఇచ్చిన దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈవో


బిళ్లకుర్రులో అగ్ని ప్రమాద బాధితులకు సాయం అందిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

అగ్ని ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే ఆర్థికసాయం

కొత్తపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం బిళ్లకుర్రు శివారు తరిట్లపేటలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిళ్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో గోడ శ్రీనివాసరావు కుటుంబం నిరాశ్రులై కట్టుబట్టలతో మిగిలారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధితులకు బియ్యం, ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి పక్కా ఇళ్ల మంజూరుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్, కముజు గంగాధరరావు, ఎంపీటీసీ చిత్రపు ఆనందబాబు, వాకాడ చిన్న, పల్లి పెంటారావు, ఇళ్ల రామసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

టమోట రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

మండపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): టమోట రైతులకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆరోపించారు. ఆదివారం ఆయన మదనపల్లిలో టమోటా రైతులను కలిసి వారి సమస్యలను తెలుపుకున్నారు. టమోట రైతులకు తమ పార్టీ అం డగా ఉంటుందని ఆయన చెప్పారు. కూటమి ప్రభుత్వం వెంటనే టమోట రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.


మదనపల్లిలో టమోట రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ప్రభాకరరావు

వెదురుపాకలో పేదలకు చీరల పంపిణీ

రాయవరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఆదివారం పేదలకు చీరలు పంపిణీ చేశారు. పీఠాధిపతి గాడ్ సతీమణి సీతామహాలక్ష్మి జయంతిని పురస్కరించుకుని గాడ్ కుమార్తెలు సత్యవెంకట కామేశ్వరి ఆధ్వర్యంలో సీతామహాలక్ష్మి విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం గ్రామంలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, బుజ్జి, పీఆర్వో బాబీ, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, భక్తులు పాల్గొన్నారు.

దేశం కోసం రోజూ గంట సమయం కేటాయించాలి

ద్రాక్షారామ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): సమాజానికి దేశభక్తి, దైవభక్తి రెండు కళ్లు అని వక్తలన్నారు. ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి 100 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో సమావేశం జరిపారు. ప్రతి ఒక్కరు దేశం కోసం రోజులో ఒక గంట కేటాయించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు వీరభద్రరాజు, వేదపాఠశాల రవి, సేఠ్ గోపీరామ్, బీవీబీఎల్ నారాయణ, యాళ్ల బుజ్జి, ఆళ్ల బుజ్జి, తోట రామకృష్ణ, దూడల శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'మద్యం నియంత్రణ సెంటర్లు ఏవీ?'

రావులపాలెం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మద్యం నియంత్రణలో భాగంగా అన్ని ప్రాంతాల్లో డిఅడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని గాలికి వదిలేసిందని కోనసీమ జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు మెర్ల శాస్త్రులు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కొత్తపేట నియోజకవర్గ పరిధిలో మండలానికి ఒక డిఅడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ కు వినతిపత్రాలు పంపించినట్లు ఆయన తెలిపారు.


విజయవాడలో నర్సిపూడి విద్యా పబ్లిక్ స్కూల్ అధినేత గాంధీని సత్కరిస్తున్న దృశ్యం

అవార్డులు రావడంపై హర్షం

ఆలమూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూల్స్ అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషిస్తున్న నర్సిపూడి శ్రీవిద్యా, కొత్తూరు సెంటర్ బ్లూబెల్స్ స్కూల్ అధినేతలు కామిరెడ్డి గాంధీ, ఈదుపుగంటి పద్మావతిలను అప్స ఐకాన్ అవార్డులకు ఎంపికయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో వారికి అవార్డులు అందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్వర్యంలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆలమూరు మండలం నుంచి కామిరెడ్డి గాంధీ, పద్మావతిలను సత్కరించారు. అవార్డులు స్వీకరించిన వారిని మండల ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యులు అభినందించారు.


బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న మంత్రి సుభాష్

మంత్రి సుభాష్ ఆర్థికసాయం

ద్రాక్షారామ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెల్ల గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలకు మంత్రి సుభాష్ ఆర్థికసాయం అందజేశారు. వెల్ల గ్రామానికి చెందిన వాసంశెట్టి దుర్గాప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మంత్రి ఆదివారం పరామర్శించారు. వారి కుటుంబానికి రూ.20వేలు ఆర్థికసాయం అందించారు. అదే విధంగా అనారోగ్యంతో శస్త్ర చికిత్స చేయించుకున్న ఈతా వీరబాబును పరామర్శించి రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీను, టీడీపీ నాయకులు ఆకుల నారాయణరావు, మాజీ సర్పంచ్ వట్టికూటి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

అంబాజీపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 విభాగంలో తైక్వాండో పోటీల్లో అంబాజీపేటకు చెందిన కె.సుందరిప్రియ, ఇషాశ్రీ నిజ, ఎం.మౌనిక, బి.హేమహృతిక్, పి.చరణ్యశ్రీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు త్వరలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.



మండపేట మండలం పాలతోడులో పారిశుధ్య పనులు చేస్తున్న దృశ్యం. పక్క చిత్రంలో కె.గంగవరం మండలం దంగేరులో చెత్త సేకరిస్తున్న దృశ్యం

స్వచ్ఛ పంచాయతీలుగా అవార్డుకు ఎంపిక

మండపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం పాలతోడు ఉత్తమ స్వచ్ఛ పంచాయతీగా ఎంపికైంది. సోమవారం అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో జరిగే అవార్డు ప్రదానంలో జిల్లా కలెక్టర్ నుంచి అవార్డును అందుకుంటామని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. తమ గ్రామంలో పారిశుధ్యం మెరుగుతోపాటు పరిసరాల శుభ్రత, తడిపొడి చెత్త వేరు చేయటం వంటి పలు అంశాల్లో మెరుగ్గా ఉండటం వల్ల అవార్డు దక్కిందని ఆయన చెప్పారు. సోమవారం అమలాపురంలో కలెక్టర్ నుంచి స్వచ్ఛహరిత అంబాసిడర్‌గా పాలతోడు పంచాయతీలో పనిచేసే శానిటరీ కార్మికుడు చంద్రమళ్ల చంద్రరావు ఎంపికయ్యారు. వారికి కలెక్టర్ నుంచి అవార్డులను అందుకోనున్నారు.

దంగేరు పంచాయతీకి...

కె.గంగవరం (ఆంధ్రజ్యోతి): మండలంలోని దంగేరు గ్రామ పంచాయతీ స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రాలో కోనసీమ జిల్లాస్థాయి అవార్డుకు ఎంపికైంది. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, సంపద ఉత్పత్తి కేంద్రం నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి అవార్డుకు ఎంపిక చేశారు. సచివాలయంలో పనిచేసే గ్రీన్ అంబాసిడర్ ఉండ్రాజవరపు మారేష్‌కు అవార్డు దక్కింది. దంగేరు గ్రామ కార్యదర్శి కేవీవీ సత్య నారాయణ, మారేష్‌కు సోమవారం అమలాపురంలో అవార్డు ప్రదానం చేయనున్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే చేయూత

కొత్తపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద బాధితులను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదుకోవడంతో పాటు వెంటనే తగిన చర్యలు తీసుకున్నారు. ఆదివారం వాడపాలెం నుంచి రావులపాలెం వెళుతున్న సమయంలో కొత్తపేట శివారు ఏనుగుమహల్ సమీపంలో ఒక వాహనం ప్రమాదానికి గురై భార్యాభర్తలు గాయపడ్డారు. ఈ ఘటనను చూసిన ఎమ్మెల్యే వెంటనే కాన్వాయ్‌ను ఆపి వారి పరిస్థితిని తెలుసుకుని తగిన ఏర్పాట్లు చేశారు. అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. వైద్య సిబ్బందితో ఫోన్లో మాట్లాడి తక్షణం వారికి వైద్యం అందించాలని ఆయన ఆదేశించారు. ఈ ఘటనను చూసిన స్థానికులు ఎమ్మెల్యే చొరవను అభినందిస్తూ పలువురు ప్రశంసించారు.


ఏనుగుమహల్‌లో రోడ్డు ప్రమాదానికి గురైన వారితో మాట్లాడుతున్న దృశ్యం



ఆత్రేయపురం మండలం ర్యాలిలో పశువైద్యశాల. పక్క చిత్రంలో ఏడాదికే దెబ్బతిన్న ఫ్లోరింగ్

ఏడాదికే దెబ్బతిన్న పశువుల ఆసుపత్రి ఫ్లోరింగ్

ఆత్రేయపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో చాలా కాలం ఉండాల్సిన ఆయా నిర్మాణాలు అనతికాలంలో ఛిద్రమవుతున్నాయి. ర్యాలిలో సుమారు రూ.కోటితో నిర్మించిన పశువైద్యశాల భవనం ఏడాది పూర్తవకుండానే ఫ్లోరింగ్ బీటలు వారింది. ఈ భవనాన్ని సుమారు రూ.కోటితో నిర్మించారు. భవన నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో ఆసుపత్రి ఫ్లోరింగ్ దిగబడిపోయి టైల్స్ విరిగిపోయాయని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. దీన్ని చేపట్టిన కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో ఇలాంటి పరిస్థితి తలెత్తిందని స్థానిక రైతులు ధ్వజమెత్తుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేసుకుపోయారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దెబ్బతిన్న ఫ్లోరింగ్‌ను త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.


మండపేటలో పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

ఆర్థికసాయంపై ఆటో డ్రైవర్ల హర్షం

మండపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు ప్రభుత్వం రూ.15వేలు ఆర్థికసాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆదివారం మండపేటలో పలువురు ఆటో కార్మికులు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, రాష్ట్ర ఏపీడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాదా ప్రసాదరావు, కూటమి నాయకులు జనసేన నాయకుడు నామాల చంద్రరావు, నగిరి బాపనయ్య, పలువురు ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు

మండపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి పంచాయతీలో పారిశుధ్యం మెరుగు కోసం పంచాయతీ కార్యదర్శి ఆకులు వీవీ రమణ, ఎంపీడీవో సత్యనారాయణమూర్తితో పాటు డిప్యూటీ ఎంపీడీవో దాసరి శ్రీనువాస్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఇక్కడ తడిపొడి చెత్తను వేరు చేసే చెత్త సంపద కేంద్రాన్ని తీర్చిదిద్దారు. పారిశుధ్యంపై పంచాయతీ సిబ్బంది, అధికారులు ప్రత్యేక శ్రద్ధను వహిస్తున్నారు.


ద్వారపూడిలో చెత్త సంపద కేంద్రానికి కొత్తరూపు



మంత్రి లోకేశ్‌ను కలిసిన ఏఎంసీ చైర్మన్ కేతా

రాజోలు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విజయవాడలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను రాజోలు ఏఎంసీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మి మర్యాద పూర్వకంగా కలిశారు. ఏఎంసీ చైర్మన్‌గా తనను నియమించినందుకు మంత్రి లోకేశ్‌కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాజోలు నియోజకవర్గం గురించి చర్చించారని ఆమె తెలిపారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి, రాజోలు నియోజకవర్గంలో టీడీపీ పటిష్టతకు మరింతగా కృషి చేయాలని మంత్రి లోకేష్ సూచించారని వెంకటలక్ష్మి తెలిపారు.


కలవచర్ల విద్యార్థికి ప్రతిభా పురస్కారం అందజేస్తున్న దృశ్యం

విద్యార్థికి ప్రోత్సాహకం

ఆలమూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది టెన్త్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన కలవచర్ల విద్యార్థి సాత్విక్‌కు కోనసీమ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో రూ.లక్ష చెక్కును కొత్తపేట ఎమ్మెల్యే బండారు చేతుల మీదుగా అందించారు. విద్యార్థి ప్రతిభను గుర్తించిన ఆలివ్ మిఠాయి అధినేత దొరై రాజు రూ.లక్ష సహకారం అందించారు. ఆది వారం ఎమ్మెల్యే చెక్కు అందజేశారు. కార్యక్రమంలో కత్వ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైనర్‌బాబు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు మెడిచర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నందిపు శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శి గంధ్రోతు నాగేశ్వరరావు, కొత్తపేట నియోజకవర్గ అధ్యక్షుడు అద్దరి శ్రీనివాస్, కార్యదర్శి అడపా శ్రీనివాస్, అక్కిరెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఈతకోట రహదారిలో కనకదుర్గమ్మ గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అమ్మవారి గ్రామోత్సవం

రావులపాలెం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఈతకోట నాగార్జున అగ్రికం లిమిటెడ్ (ఎన్ఏసీఎల్)లో దేవీ శరన్నవరాత్రి వేడుకల ముగింపును పురస్కరించుకుని సంస్థ సిబ్బంది గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మండపం నుంచి అమ్మవారిని పలు వీధుల్లో మంగళవాయిద్యాల మధ్య భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. జాతీయ రహదారి మీదుగా రావులపాలెం గౌతమి వంతెన వద్దకు తీసుకువచ్చి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మీడియా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా సుధీర్



అల్లవరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా కాకర సుధీర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఢిల్లీబాబు రెడ్డి ప్రకటించారు. కొమరగిరిపట్నానికి చెందిన ఏబీపీ దేశం చానల్ ఉభయ గోదావరి జిల్లాల కరస్పాండెంట్ కాకర సుధీర్‌ను నియమిస్తూ విజయవాడ మీడియా ఫెడరేషన్ ప్రధాన కార్యాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో నిర్ణయించారు.

నిత్యాన్నదానానికి రూ.50వేలు విరాళం

అంతర్వేది, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరుకు చెందిన అప్పల లక్ష్మీకామేశ్వరి రూ.50,002విరాళం అందించారు.


మండపేటలోని ఒక హోటల్‌లో తనిఖీ జరుపుతున్న ఆహార నియంత్రణ జిల్లా అధికారి(ఫైల్‌ఫొటో)

బాబోయ్...ఏది చూసినా కల్తీమయం

• వినియోగదారుల గగ్గోలు • పట్టించుకోని అధికార యంత్రాంగం • కన్పించని తనిఖీలు

మండపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హోటళ్లు, కిరాణా సరుకులు, బేకరి దుకాణాలు ఏది చూసినా కల్తీమయం అని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. వాటి నిర్వాహకులకు కాసుల వర్షం కురిపిస్తుంటే వినియోగదారులు రోగాల బారినపడుతున్నారు. మండలంలో నకిలీ టీపొడి తయారీ కుటీర పరిశ్రమగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. కిరాణా సరుకులు సహా తిను బండారాలు, నాన్‌వెజ్ వంటకాలు కల్తీవిక్రయిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఆహార భద్రత అధికారులు కల్తీ చేసిన వారిపై చర్యలు తీసుకోవల్సి ఉండగా వారు ఎక్కడా కన్పించని ప్రజలు ఆరోపిస్తున్నారు. వ్యాపారుల నుంచి నెలవారీ మామూళ్లకు పలువురు అధికారులు అలవాటుపడ్డారని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. రెస్టారెంట్లలో మాంసాహారం, శాఖా హారం వేర్వేరుగా భద్రపరచాల్సి ఉండగా అవన్నీ ఒకే ఫ్రిజ్‌లో నిల్వ చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పాత పప్పులకు రంగులు కలుపుతూ ఆయా వంటకాల్లో వినియోగిస్తున్నట్టు తెలిసింది. కుళ్లిపోయిన కూరగాయలను వాడేస్తున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు.

కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు

ఆహార పదార్థాలు కల్తీ జరిగిందని గుర్తిస్తే ఫిర్యాదు చేయాలని సంబంధిత శాఖల అధికారులు సూచిస్తున్నారు. ఆహార భద్రత నియంత్రణ ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు వెనకాడబోమని వైద్య ఆరోగ్యశాఖ హెచ్చరించింది. కేంద్ర ప్రభుత్వం పోర్టబుల్‌తో పాటు రాష్ట్ర ఆహార భద్రత విభాగానికి ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లా, డివిజన్‌స్థాయిలో ఉండే ఆహార నియంత్రణ తనిఖీ అధికారులతోపాటు మున్సిపల్ పబ్లిక్ హెల్త్ అధికారులకు కూడా ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని వారన్నారు.